సాక్షి జనగామ

గురువారం । 27 । జూలై । 2023



కేయూకు నేడు సెలవు

వర్షాల నేపథ్యంలో కేయూ క్యాంపస్‌తో పాటు వర్సిటీ పరిధి ఉమ్మడి జిల్లాల్లోని అనుబంధ కళాశాలలకు గురువారం సెలవు ప్రకటించారు. - 8లో▸



రూ.10లక్షల గంజాయి పట్టివేత

కాజీపేటలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.10లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 25.0^0 / 23.0^0

ఉదయం నుంచి ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. చల్లని గాలులు వీస్తాయి. మధ్యాహ్న ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి.

న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరించాలి



దేవరుప్పుల: తమ సమస్యలు పరిష్కరించాలని చిందు యక్షగాన వృత్తి కళాకారులు సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కోరారు. ఈ మేరకు నూతన రాష్ట్ర కమిటీ బాధ్యులు బుధవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిశారు. వృత్తి కళాకారులకు ప్రభుత్వ పరమైన ప్రదర్శనలు ఇస్తే ప్రస్తుతం ఇచ్చే పారితోషికం సరిపోవడంలేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.30వేల వరకూ పెంచాలని, అలాగే మృతి చెందిన కళాకారులకు రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని ఈ సందర్భంగా హంస అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య మంత్రిని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లిట్ల ముకుందం, వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం హిమగిరి, ప్రధాన కార్యదర్శి గజివెల్లి ప్రతాప్, ఉపాధ్యక్షుడు గడ్డం సుదర్శనం, కార్యదర్శి పిల్లిట్ల రమేష్, కోశాధికారి డి.సురేందర్, గడ్డం సోమరాజు ఉన్నారు.

కాంగ్రెస్ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడిగా సుమన్‌నాయక్



స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా మండల పరిధి జిట్టెగూడెంకు చెందిన నునావత్ సుమన్‌నాయక్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివాసీ ఎస్టీసెల్ రాష్ట్ర చైర్మన్ బెల్లయ్యనాయక్ హైదరాబాద్‌లో నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సుమన్‌నాయక్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

50 మందికి ఉచిత లెర్నింగ్ లైసెన్స్



జనగామ: జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి చేతుల మీదుగా 50 మందికి ఉచిత లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలు అందజేశారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్, మిద్దెపాక లెనిన్, రాజు రోడ్రిక్స్, దేవుని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

జనగామ రూరల్: రాష్ట్ర స్థాయిలో 2023 విద్యా సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రాము ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జెడ్పీ, ఎంపీ, రెసిడెన్షియల్, సొసైటీలు, డైట్, జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకులు ఆగస్టు నాలుగో తేదీలోపు డీఈఓ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు.

జేఏసీ వైస్ చైర్మన్‌గా 'తీగల'



జనగామ: ఉమ్మడి వరంగల్ జిల్లా గౌడ జేఏసీ వైస్ చైర్మన్‌గా లింగాలఘణపురం మండలం నవాబుపేటకు చెందిన తీగల సిద్ధుగౌడ్‌ను నియమిస్తూ 'గోపా' ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చిర్ర రాజు గౌడ్, గౌరవ అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూనే, రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేలా ప్రణాళికలు రూపొందిస్తామని ఈ సందర్భంగా సిద్ధుగౌడ్ తెలిపారు.

ప్రయాణికుల సౌకర్యార్థం టీ9 టికెట్

జనగామ: గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రయాణికులపై ఆర్థిక భారం తగ్గించేందుకు ఆర్టీసీ యాజమాన్యం కొత్తగా టీ9 టికెట్ అందుబాటులోకి తెచ్చిందని జనగామ డిపో మేనేజర్ జ్యోత్స్న అన్నారు. బుధవారం ఆమె డిపోలో విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో స్వల్ప దూరం ప్రయాణించే వారికి సైతం ఉపయోగపడే ఈ రాయితీ టికెట్ గురువారం నుంచి వినియోగించుకోవచ్చని చెప్పారు. ప్రస్తుతం టీ9–60 టికెట్ అందుబాటులో ఉందని, రోజూ ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు రూ.50తో 30 కిలోమీటర్ల పరిధిలో రాను పోను ప్రయాణం చేసే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 6 వరకు మాత్రమే ఈ టికెట్ ఇస్తామని, పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే సాధారణ ప్రయాణికులకు ఈ రాయితీ పథకం వర్తిస్తుందని తెలిపారు. 30 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఇతర రాష్ట్రాలకు సైతం టీ9 టికెట్ ఉపయోగపడుతుందని, ఎక్స్‌ట్రా రూ.20 కాంబి టికెట్ తీసుకుని ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లోనూ ప్రయాణించవచ్చని వివరించారు.

ఆగని వర్షం

మత్తడి పోస్తున్న 497 చెరువులు

- రిజర్వాయర్లకు చేరుతున్న వరద
- నీట మునిగిన పంట పొలాలు
- పలు రూట్లలో నిలిచిన రాకపోకలు
- కొనసాగుతున్న దారిమళ్లింపు
- మరో మూడు రోజులు ఇదే పరిస్థితి
- హెచ్చరించిన వాతావరణ శాఖ
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం



ఉప్పుగల్లు–తమ్మడపల్లి(ఐ) మధ్య కొట్టుకుపోయిన కల్వర్టు

జనగామ: ఎడతెరిపి లేని వర్షంతో జిల్లాలో చెరువులు, వాగులు పొంగిపొర్లుతుండగా.. రిజర్వాయర్లు జళకళను సంతరించుకున్నాయి. ఆగకుండా కురుస్తున్న జోరు వానతో జనజీవనానికి ఇబ్బందులు తప్పడం లేదు. మరో మూడు రోజుల పాటు అతి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ శివలింగయ్య నేతృత్వంలో రెవెన్యూ, పోలీసు, ఫైర్ విభాగాలు అత్యవసర సమయంలో ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సమన్వయంతో పని చేస్తున్నాయి.

గేట్లు ఎత్తి.. నీరు వదిలి

జిల్లాలో 497 చెరువులు, కుంటలు మత్తడి పోస్తుండగా, కల్వర్టులు, మట్టిరోడ్లు కోతకు గురయ్యాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుండగా.. వాహనాల డైవర్షన్ కొనసాగుతోంది. జనగామ మండలం చీటకోడూరు రిజర్వాయర్ నాలుగు గేట్లు ఎత్తి, 400 క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నారు. అలాగే నర్మెట మండలం గండిరామవరం రిజర్వాయర్ రెండు గేట్లు ఎత్తి 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వర్షం ఇలాగే ఉంటే లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉండడంతో జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. వరద పెద్ద ఎత్తున ఉండడంతో అనేక చోట్ల వందలాది ఎకరాల వరి పొలాల్లో ఇసుక మేటలు పేరుకు పోతున్నాయి. చెరువుల్లోని చేపలు ఎదురీదుతుండడంతో.. గ్రామాల ప్రజలు వేటకు వెళ్తున్నారు. ప్రధాన రహదారుల్లోని కల్వర్టుల వద్ద అర్ధరాత్రి వరకు వదర ఉధృతి ప్రమాద స్థాయికి చేరే అవకాశం ఉండడంతో పోలీసు, రెవెన్యూ విభాగాలు సంయుక్తంగా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి, సిబ్బందిని కాపలా పెట్టాయి.

578 మిల్లీమీటర్ల వర్షపాతం

జిల్లాలో మంగళవారం ఉదయం 8 నుంచి బుధవారం ఉదయం వరకు 408 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైయింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు 578.4 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. సాయంత్రం 5 గంటల వరకు 20.5, ఆరుగంటలకు 27.0, రాత్రి 7 గంటలకు 35.1, ఎనిమిది గంటలకు 38.5, తొమ్మిది గంటలకు 43.3, పది గంటల వరకు 48.2 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు సీపీఓ ఇస్మాయిల్ తెలిపారు. కాగా రాత్రి పది గంటలకు జఫర్‌గఢ్‌లో 121.0(ఆరెంజ్ అలర్ట్), పాలకుర్తి 83.7(ఆరెంజ్ అలర్ట్), కొడకండ్ల 96.5(గ్రీన్ అలర్ట్), దేవరుప్పుల 53.4, చిల్పూరు 39.8, రఘునాథపల్లి 36.3, స్టేషన్‌ఘన్‌పూర్ 30.3, తరిగొప్పుల 26.2, లింగాలఘణపురం 30.3, జనగామ 25.6, నర్మెట 21, బచ్చన్నపేటలో 14.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

జిల్లాలో వర్ష ప్రభావం

- నర్మెట–జనగామ రూట్‌లో వయా హన్మంతాపురం మీదుగా రాకపోకలు నిలిచి పోవడంతో వెల్దండ నుంచి దారిమళ్లించారు. ఆ గ్రామ చెరువు మత్తడి పోస్తుండంతో ఏక్షణమైనా ప్రయాణం నిలిచిపోయే అవకాశం ఉంది. మేకల గట్టు వద్ద కల్వర్టుపై వరద తీవ్రమవడంతో నర్మెట–రఘునాథపల్లి రూట్‌లోనూ పరిస్థితి ఇలానే ఉంది.
- స్టేషన్‌ఘన్‌పూర్ మండల పరిధిలో చెరువులు మత్తడి పోస్తుండగా.. వాగులు పొంగి పొర్లుతూ పంట పొలాలను నీట ముంచాయి. అనేక గ్రామాల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఘన్‌పూర్ రిజర్వాయర్ మత్తడి పడే అవకాశం ఉంది.
- జఫర్‌గఢ్ పరిధి చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నిండి మత్తడి పోస్తున్నాయి. వరద తాకిడికి కొన్నిచోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. ఉప్పుగల్లు–తమ్మడపల్లి(ఐ) గ్రామాల మధ్య కల్వర్టు కొట్టుకు పోయింది. రఘునాథ్‌పల్లి గ్రామంలో చౌటకుంట కట్ట తెగిపోవడంతో పొలాలు నీట మునిగాయి.
- రఘునాథపల్లి మండలం ఇబ్రహీంపూర్ వద్ద మత్తడి ఉధృతితో పాత ఊరుకు రాకపోకలు నిలిచిపోయాయి. మాదారంలో రహదారి భారీగా కోత గురైంది. మండలగూడెం నుంచి జనగామకు వెళ్లే కల్వర్టు వద్ద మట్టి రోడ్డు కొట్టుకు పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. శ్రీమన్నారాయణపురం నుంచి బాంజీపేట, కోడూరు నుంచి రామన్నగూడెం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి కల్వర్టు వద్ద వాగు ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయాయి.

జిల్లాలో వర్ష ప్రభావంతో ఇప్పటి వరకు జరిగిన నష్టం

మృతి చెందిన గేదెలు	: 5
పూర్తిగా కూలిపోయిన ఇళ్లు	: 3
పాక్షికంగా దెబ్బతిన్నవి	: 85
కోతకు గురైన దారులు, బ్రిడ్జి, కల్వర్టులు	: 13
మొత్తం చెరువులు	: 797
25 నుంచి 50శాతం నీటిమట్టం ఉన్నవి	: 105
50 నుంచి 75 శాతం	: 44
75 నుంచి 100 శాతం	: 151
మత్తడి పోస్తున్న చెరువులు	: 497

రిజర్వాయర్లలో నీటి మట్టం వివరాలు(మీటర్లలో)

రిజర్వాయర్	సామర్థ్యం	ప్రస్తుతం
గండిరామవరం	422	422
బొమ్మకూరు	475	471.550
చీటకోడూరు	389	389
నవాబుపేట	328.800	325.300
ఆర్‌ఎస్.ఘన్‌పూర్	338.215	336.250
అశ్వరావుపల్లి	400	395.800
మైలారం	250.500	249.400

- మరిన్ని ఫొటోలు 9లో▸



స్టేషన్‌ఘన్‌పూర్ : తాటికొండలో నీటమునిగిన వరి పొలాలు



ఇబ్రహీంపూర్‌లో అలుగు పోస్తున్న పెద్ద చెరువు



జఫర్‌గఢ్ : రఘునాథ్‌పల్లిలో తెగిన కుంట కట్ట



బచ్చన్నపేట గుడిచెరువు మత్తడి వద్ద చేపలు

కలెక్టరేట్ సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలి
- పారిశుద్ధ్య పనులపై దృష్టి పెట్టాలి
- సమీక్షలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

జనగామ: జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు సేవలందించాలని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి, కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. వంతెనలు, రహదారులు దెబ్బతినకుండా పీఆర్, ఆర్‌అండ్‌బీ, ఎస్‌హెచ్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో రిజర్వాయర్లు, చెరువులకు ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు లేవని, విద్యుత్ అంతరాయం, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాలు, మున్సిపల్ కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో అలసత్వం వద్దని, ముఖ్యంగా డ్రైనేజీల్లో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని తొలగించి వరద సాఫీగా వెళ్లేలా చూడాలని పేర్కొన్నారు. సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని తెలిపారు. వర్షాలతో దెబ్బతిన్న ఇళ్లు, రోడ్లు, భవనాలు, వంతెనలు, నష్టపోయిన పంటల వివరాలు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామపంచాయతీ, మున్సిపల్ శానిటేషన్ విభాగం పని చేయాలని ఆదేశించారు. ఇంటింటా సర్వే నిర్వహించి విషజ్వరాలు, అంటువ్యాధులతో బాధపడే వారిని గుర్తించి వైద్యం అందించాలని చెప్పారు. గ్రామస్థాయిలో ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, ఇతర వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు.

వైద్యులకు మంత్రి అభినందనలు

24 గంటల వ్యవధిలో 31 కాన్పులు చేసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న జిల్లా మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) వైద్యులు, సిబ్బందిని మంత్రి దయాకర్‌రావు అభినందించి సత్కరించారు. ఆయన ఎంసీహెచ్‌ను సందర్శించి బాలింతల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా శిశు సంరక్షణకు అనేక కార్యక్రమాలు చేపడుతోందని, సాధారణ ప్రసవాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. సర్కారు ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పా రు. అనంతరం బాలింతలకు కేసీఆర్ కిట్లు పంపిణీ చేశారు.

ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి : సీఎస్

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టర్లతో బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో కలిసి కలెక్టర్ శివలింగయ్య పాల్గొన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీఎస్ చెప్పారు. ప్రత్యేక కంట్రోల్ రూం ద్వారా వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

గ్రామాల్లో పోలీసుల పర్యటన



జనగామ మండలంలో వరద ఉధృతి గురించి ప్రజల నుంచి తెలుసుకుంటున్న ఏసీపీ, సీఐ

ఎడతెరి లేకుండా కురుస్తున్న వర్షాలతో డీజీపీ ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు అన్ని గ్రామాల్లో పర్యటించారు. కల్వర్టుల వద్ద వరద ఉధృతి, రాకపోకలు, కోతకు గురైన రోడ్ల పరిస్థితిని పరిశీలించారు. డీసీపీ పి.సీతారాం నేతృత్వంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్ జనగామ మండలంలో పర్యటించి, సర్పంచ్, ఎంపీటీసీ, ఇతర ప్రజా ప్రతినిధులతో మాట్లాడారు. అత్యవసర సమయంలో వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దు

- పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్



వరంగల్ క్రైం: భారీ వర్షాల దృష్ట్యా కమిషనరేట్ పరిధిలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువల, చెరువుల వద్దరు వెళ్లవద్దని, చెట్ల కింద, పాడైన భవనాల కింద ఉండవద్దని సూచించారు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, వర్షానికి రోడ్లు కొట్టుకపోయి గుంతలు ఏర్పడుతున్నాయని, అందులో నీరు నిల్వ ఉండడంతో వాహనదారులకు కనిపించక ప్రమాదాలు జరిగే అస్కారం ఉందని తెలిపారు. వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జిల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయరాదని సూచించారు. ప్రజలకు సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ జోన్ పరిధిలోని పోలీస్ యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కి ఫోన్ చేసి పోలీస్ సహాయం పొందాలని తెలిపారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్‌రావు

గుండె'జల్లు'..

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనజీవనం అస్తవ్యస్తం

8లో▸

ఉప్పొంగిన గోదావరి

- ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు

- వివరాలు 10లో▸

ఘన్‌పూర్ మున్సిపాలిటీకి గ్రీన్‌సిగ్నల్ ..!

- శివునిపల్లి, ఛాగల్లుతో కలిపి ఏర్పాటు

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీ చేయడానికి ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. జంటపట్టణంగా ఉన్న శివునిపల్లితో పాటు ఛాగల్లు జీపీలను కలుపుతూ స్టేషన్‌ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీ చేయనున్నారు. ఈ మేరకు తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ నుంచి కలెక్టర్‌కు, డీపీఓకు సర్క్యులర్‌లు అందినట్లు సమాచారం. వివరాలు ఇలా ఉన్నాయి. ఘన్‌పూర్‌కు అన్ని అర్హతలున్నా మున్సిపాలిటీ అయ్యేందుకు పదేళ్లుగా ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ విషయమై ఇప్పటికే ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి గతంలో ప్రభుత్వానికి నివేదికలు అందించారు. ఘన్‌పూర్ కంటే చిన్నదిగా ఉన్న వర్ధన్నపేటను మున్సిపాలిటీ చేయడంతో అన్ని అర్హతలున్న ఘన్‌పూర్ ప్రజలు నిరాశగా ఉన్నారు. ఈ క్రమంలో గ్రీన్‌స్నిగల్ వచ్చినట్లు తెలుస్తున్నది. కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ రంగాచారి స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్లు గ్రామాల నుంచి అంగీకార తీర్మాన పత్రాలు ఇవ్వాలని ఆయా జీపీలకు సర్క్యులర్లు పంపించారు. దీంతో ఘన్‌పూర్ సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, శివునిపల్లి ప్రత్యేక అధికారి అంగీకార తీర్మాన పత్రాన్ని బుధవారం జనగామలో డీపీఓకు అందించారు. అయితే ఛాగల్లు గ్రామం నుంచి తీర్మాన పత్రం రావాల్సి ఉంది. అతిత్వరలోనే స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ కానుందనే అంశం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. కార్యక్రమంలో ఎంపీటీసీలు గుర్రం రాజు, కనకం స్వరూపగణేష్, పీఏసీఎస్ డైరెక్టర్ తోట సత్యం తదితరులు పాల్గొన్నారు.



తీర్మాన పత్రాన్ని డీపీఓకు ఇస్తున్న సర్పంచ్

'వేధింపులు మానుకోవాలి'

జనగామ రూరల్: జిల్లాలోని ఉపాధ్యాయులు మెడికల్ బిల్లులు సమర్పించే విషయంలో ఆన్‌లైన్ చేయాలని వేధింపులు గురిచేయడం మానుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రావు అన్నారు. ఈ మేరకు బుధవారం డీఈఓకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో మెడికల్ బిల్లులు సమర్పించే అవకాశం ఉందని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ ఉపాధ్యాయులను కార్యాయానికి పిలిపించుకోవడం సరికాదన్నారు.

విద్యుత్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి

- ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ వేణుమాధవ్

జనగామ: రాబోయే మూడు రోజుల పాటు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు, రైతులు జాగ్రత్తగా ఉండాలని ఎన్పీడీసీఎల్ జిల్లా ఎస్‌ఈ వేణుమాధవ్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా సంభవించే ఆస్కారం ఉందని, తడి చేతులతో విద్యుత్ పరికరాలు, తీగలను తాకవద్దని, అతుకుల వైర్లను వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. చిన్న పిల్లలను విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండేలా చూడాలని, సెల్ ఫోన్ చార్జింగ్ పెట్టి ఎట్టి పరిస్థితుల్లో మాట్లాడకూదని చెప్పారు. 3పిన్ ప్లగ్‌తో నాణ్యమైన చార్జర్లను మాత్రమే వినియోగించాలన్నారు. విద్యుత్ స్తంభాల వద్ద ప్రమాదవశాత్తు ఎవరైనా విద్యుదాఘాతానికి గురైతే వారిని చేతితో పట్టుకోకుండా కర్ర, ప్లాస్టిక్ లాంటి వస్తువులతో వేరు చేసే ప్రయత్నం చేయాలన్నారు. వ్యవసాయ పొలాల వద్ద స్టార్టర్లు, కరెంట్ మోటార్లు, పైపులను, ఫుట్ వాల్వులను చేతితో తాకరాదన్నారు. అత్యవసర సమయంలో విద్యుత్ సంబంధిత సమస్యలు, ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్–1800 425 0028కు లేదా 1912, జిల్లా కేంద్రం ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నంబర్ –79016 28363లో సంప్రదించాలని కోరారు.

అన్ని రంగాల్లో దూసుకెళ్లాలి

జనగామ/జనగామ రూరల్: ప్రత్యేక అవసరాల పిల్లలు అవకాశాలను అందిపుచ్చుకొని అన్ని రంగాల్లో దూసుకుపోవాలని డీఈఓ రాము అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో బుధవారం 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసబులిటీస్' సికింద్రాబాద్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో మానసిక దివ్యాంగ విద్యార్థులకు టీఎల్‌ఎం కిట్లను ఆయన అందజేసి మాట్లాడారు. ఈ కిట్లను సరైన పద్ధతిలో ఉపయోగించాలని, వివరాలను ఐఈఆర్‌పీల ద్వారా తెలుసుకుని తర్వాత ఇంట్లో తమ పిల్లలతో నిత్యం సాధన చేయించాలని చెప్పారు. జిల్లా పరిధి భవిత పాఠశాలల్లో చదువుతున్న 73 మందికి ఒక్కొక్కరికి రూ.10వేల విలువ చేసే కిట్లు ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి బి.శ్రీనివాస్, ఎస్‌ఐఈపీఈడీ అధికారి శ్యామ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ అశోక్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతి, సీపీఓ ఇస్మాయిల్, విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ రాజు, ఏఎస్‌సీఓ రమేష్, డీపీఎం పాల్గొన్నారు.



టీఎల్‌ఎం కిట్ అందజేస్తున్న డీఈఓ రాము

పఠనా సామర్థ్యాలు పెంపొందించాలి

ఉపాధ్యాయులు భౌతిక వనరులను ఉపయోగించి విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పెంపొందించా లని డీఈఓ కె.రాము అన్నారు. ఉపాధ్యాయులకు 'శాలసిద్ధి మూల్యాంకన చట్రం'పై పట్టణంలోని ఏకశిల బీఈడీ కళాశాలలో బుధవారం నిర్వహించిన రెండవ రోజు శిక్షణ కార్యాక్రమానికి జిల్లాలో ఎంపిక చేసిన 31 పాఠశాలల నుంచి 72 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. మానిటరింగ్ అధికారి బి.శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

నేడు కిసాన్ సమృద్ధి కేంద్రాలు ప్రారంభం

జనగామ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కిసాన్ సమృద్ధి కేంద్రాలను జిల్లా అధికారులు గురువారం (నేడు) ప్రారంభించనున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లడుతూ పంటల సాగుకు అవసరమైన వివిధ రకాల సేవలు అన్ని ఒకే గొడుగు కిందకు చేర్చేందుకు కేంద్రం ఈ చర్యలు చేపట్టిందన్నారు. ఎరువుల రిటైల్ షాపులను దశలవారీగా వన్ స్టాప్ సెంటర్లుగా మార్చాలని నిర్ణయించినట్లు చెప్పారు. జిల్లాలో 123 కిసాన్ సమృద్ధి కేంద్రాలు ఏర్పాట్లు చేస్తున్నారని, నేటి నుంచి సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు.

యువకుడి ఆత్మహత్య


అనిల్ (ఫైల్)

నర్సంపేట రూరల్ : పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు నర్సంపేట టౌన్‌సీఐ పులి రమేష్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకా రం.. నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామ శివారులోని అమృతండాకు చెందిన భూక్యా రాజేందర్-భద్ర మ్మ దంపతుల కుమారుడు భూక్యా అనిల్ (18) నర్సంపేట పట్టణంలో ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. కళాశాలకు సక్రమంగా వెళ్లడంలేదని, చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో క్షణికావేశానికి లోనై బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనిల్ గతంలో కూడా రెండుమార్లు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చెన్నారావుపేట: మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన నీరటి రమేష్(47) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. రమేష్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 15 సంవత్సరాల క్రితం నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లికి చెందిన సునీతతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు ఉన్నాడు. రమేష్ మద్యానికి బానిసై భార్య, కుమారుడిని పట్టించుకోకపోవడంతో భార్య సునీత పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో రమేష్ అధికంగా మద్యం సేవిస్తుండంతో తండ్రి ఐలయ్య మంగళవారం మందలించాడు. మనస్తాపానికి గురైన రమేష్ ఇంట్లో పురుగుల మందు తాగాడు. చుట్టు పక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. రమేష్ తండ్రి ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేయూకు నేడు సెలవు

- అన్ని పరీక్షలు వాయిదా



కేయూ క్యాంపస్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌తోపాటు, వర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని వర్సిటీ అనుబంధ కళాశాలలకు కూడా ఈనెల 27వ తేదీని సెలవుగా ప్రకటించారు. అలాగే, యూనివర్సిటీ పరిధిలో ఈ ఈ నెల 26, 27వ తేదీల్లో జరిగే వివిధ పరీక్షలను కూడా వాయిదా వేశారు.

వాయిదా పడిన పరీక్షలు ఇవే..

కేయూ పరిధిలో ఈ నెల 26న జరగాల్సిన (బుధవారం) బీఫార్మసీ 8వ సెమిస్టర్ పరీక్షలు, బీటెక్ (నాన్‌సీబీసీఎస్) మొదటి సంవత్సరం, నాలుగో సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు, ఈనెల 27న జరగాల్సిన బీఫార్మసీ 8వ సెమిస్టర్ పరీక్షలు, బీటెక్ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేశామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు.మళ్లీ ఎప్పుడు నిర్వహించే తేదీలను తరువాత ప్రకటిస్తామని వారు పేర్కొన్నారు.

గుండె'జల్లు'..

ఎల్కతుర్తిలో నీటమునిగిన వరిపంట



కాజీపేట రూరల్:గుంతలు పడిన ఫాతిమా,దర్గా రోడ్డు



ఎల్కతుర్తిలో పత్తిపంటలో నిలిచిన వర్షపు నీరు



దంచికొడుతున్న వానలు..

- నీటమునిగిన పంటపొలాలు
- కూలిన ఇళ్లు..తెగిపోయిన రోడ్లు

ఆకాశానికి చిల్లు పండిదా అనేలా కురుస్తున్న వర్షాలకు గుండె'జల్లు'మంటోంది. ఉమ్మడి జిల్లాలో కొద్ది రోజులుగా కురుస్తున్న వానలకు కనుచూపు మేర నీరే కనిపిస్తోంది. చెరువులు మత్తళ్ల పరవళ్లు దూకుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో పంటపొలాలు నీటమునిగి అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అలాగే, ఇళ్లు కూలిపోయి బాధితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వరద ప్రవాహానికి రహదారులు తెగిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మొత్తంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారుతోంది.

- సాక్షి, నెట్‌వర్క్


వాజేడు: నీట మునిగిన పొలాలు


వెంకటాపురం(కె): పాలెంలో కూలిన పెంకుటిల్లు


పలిమెల: కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ


చెన్నారావుపేట: బోజేర్వులో కూలిన ఇల్లు


చెన్నారావుపేట: గుంతలమయమైన రోడ్డు


ఆత్మకూరు : నీరుకుళ్లలో కూలిన ఇల్లు


సంగెం : తీగరాజుపల్లిలో కూలిన పెంకుటిల్లు


పర్వతగిరి: గండిపడిన జమాల్‌పూర్ రోడ్డు


స్టేషన్‌ఘన్‌పూర్: పాంనూర్‌లో మునిగిన పొలాలు




ఖిలా వరంగల్ : మధ్య కోటలో మునిగిన ఆకుకూర పంటలు


కాశిబుగ్గ : చింతా హరిజనవాడలో కూలిన ఇల్లు

ఆదివాసీ ఆణిముత్యం..

స్కాలర్ షిప్‌తో చదువుకుని.. అమెరికాలో ప్రొఫెసర్ స్థాయికి

- మారుమూల ఏజెన్సీ ఆదివాసీ యువకుడి ఘనత
- ఈనెల 28న అమెరికా వెళ్లనున్న ఈక ప్రభాకర్
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు


ల్యాప్‌టాప్‌లో తన ఎంపికను చూస్తున్న ఈక ప్రభాకర్

కొత్తగూడ : కడు పేదరికం.. తినడానికి అన్నం కూడా దొరకని పరిస్థితి. తండ్రి పని చేస్తేనే పూటగడిచేది. లేనిపక్షంలో పస్తులుండడమే. పైగా మారుమూల గ్రామం.. అందులో పాఠశాల కూడా లేని కుగ్రామం. ఇలాంటి తరుణంలో ఎవరికైనా చదువుకోవాలనే ఆలోచనే రాదు. ఏదైనా పని చేసుకుని బతకాలని భావిస్తారు. కానీ అలాంటి వారికి ఈ యువకుడు పూర్తిగా విరుద్ధం. చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించాడు. ఒక పక్క సమస్యలతో సహవాసం చేస్తూనే.. మరో పక్క అనుకున్న లక్ష్యాన్ని చేరుకుని పలువురికి ఆదర్శంగా నిలిచాడు. ఆయననే మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మారుమూల ఏజెన్సీ ఆదివాసీ గ్రామం దొరవారివేంపల్లికి చెందిన ఈక ప్రభాకర్. తాను ఎంచుకున్న విద్యలో ఖండాంతరాలు దాటి అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ అయోవాలో ప్రొఫెసర్‌గా పని చేసేందుకు ఎంపికయ్యారు. ఎర్ర బస్సు కూడా ఎరగని ఈ గ్రామం నుంచి అమెరికాకు వెళ్లడంపై గ్రామస్తుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈక పాపమ్మ-సమ్మయ్య దంపతుల ప్రథమ సంతానం ప్రభాకర్. తన ఎదుగుదల గురించి ఆయన మాటల్లోనే..

'పోడు వ్యవసాయం ఆధారంగానే మా కుటుంబ పోషణ గడిచేది. తినడానికే ఇబ్బంది పడే పరిస్థితి. గ్రామంలో పాఠశాల కూడా లేదు. 1989లో అప్పటి ఐటీడీఏ పీఓ బెస్ట్ అవైలెబుల్ పాఠశాలలకు విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు. హాస్టల్‌కు వెళ్తే కనీసం అన్నం అయినా సరిగా దొరుకుతుందనుకునే పరిస్థితి ఉండేది. ఈ పరిస్థితిలోనే రాజేంద్ర కాన్వెంట్ హై స్కూల్‌లో సీటు వచ్చింది. పాఠశాల చదువులోనే మా తల్లి పాపమ్మ 1997లో మృతి చెందింది. ఈ ఘటనను దిగమింగుకుని పదో తరగతి పూర్తి చేశా. అనంతరం ఇంటర్ ఎల్‌బీ కళాశాల వరంగల్‌లో, కర్నూలు సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో బీజెడ్‌సీ గ్రూపులో డిగ్రీ పూర్తి చేశా. వారణాసిలోని బనారస్ హిందూ యూనివర్సిటీలో బయో టెక్నాలజీలో పీజీ పూర్తి చేశా. బెస్ట్ అవైలెబుల్ స్కీం పూర్తయిన తరువాత ఐటీడీఏ నుంచి స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యా. ఆ స్కాలర్ షిప్‌తోనే డిగ్రీ, పీజీ పూర్తయింది. 2006 నుంచి 2013 వరకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డి పూర్తి చేశా. 2013 నుంచి 2017 వరకు సీఎస్ఐఆర్‌ఆర్‌ఏలో రీసెర్చ్ అసోసియేట్‌గా పని చేశా. ఇదే సమయంలో మండలంలోని ఈశ్వరగూడెం గ్రామానికి చెందిన రవళితో వివాహమైంది. పీహెచ్‌డీ ఫెలోషిప్‌లో భాగంగా 'టాటా ఇన్‌స్టిట్యూట్ ఫండమెంటల్ రిసెర్చ్'లో సంవత్సరం పని చేశా. అనంతరం గీతం యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరాను. అక్కడ ప్రొఫెసర్‌గా పని చేస్తూనే గత సంవత్సరం అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ అయోనాలో ప్రొఫెసర్‌గా అప్లికేషన్ చేశాను. నాలుగు దఫాలుగా జరిగిన ఇంటర్వ్యూల ఆధారంగా నన్ను ఎంపిక చే సి వీసా ఇచ్చారు. ఈనెల 28న అమెరికాకు వెళ్తు న్నా. ఖండాతరాలు దాటి ప్రొఫెసర్‌గా పనిచేసే అ వకాశం వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది'.

ఆదివాసీలకే ఆదర్శం..



చిన్న కారణాలతో విద్యను మధ్యలో వదిలేసి వెనుకబడిపోతున్న ఆదివాసీ యువతకు ప్రభాకర్ ఆదర్శంగా నిలిచారు. సరైన రోడ్డు కూడా లేని తమ గ్రామం నుంచి అమెరికా వెళ్లడం తమకు ఎంతో గర్వంగా ఉందని దొరవారివేంపల్లి గ్రామస్తులు పేర్కొంటున్నారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు


టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

హన్మకొండ: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలకు ఆస్కారమెక్కువగా ఉంటుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు తెలిపారు. రాష్ట్రంలో రాబోయే మూడు రోజులపాటు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, ఈ క్రమంలో విద్యుత్ వినియోగదారులు, రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని బుధవారం ఆయన ఒక ప్రకటనలో సూచించారు. ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు తాకొద్దని సూచించారు. దుస్తులు ఆరేసే దండేలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. సర్వీస్ వైర్లు అతుకులు లేకుండా చూసుకోవాలన్నారు. రైతులు విద్యుత్ మోటార్లు, స్టాటర్ల వద్ద జాగ్రత్తలు పాటించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లొద్దని, సమస్యలుంటే విద్యుత్ అధికారులు, ఉద్యోగుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల పరిధిలో విద్యుత్ పర్యవేక్షణ చేయడానికి కార్పొరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నిరంతరాయంగా పని చేస్తుందని తెలిపారు. సమస్యలు, ఫిర్యాదులను 9440811244, 9440811245 నంబర్‌లకు ఫోన్ చేసి తెలపాలని కోరారు. అదే విధంగా టోల్ ఫ్రీ నంబర్ 1800 425 0028కు లేదా 1912కు ఫోన్ చేసి తెలపొచ్చన్నారు.

చుట్ట అంటుకుని..

- వృద్ధురాలి సజీవదహనం
- దేవరుప్పలలో ఘటన
- పోలీసులకు మృతురాలి కూతురి ఫిర్యాదు


ముత్తమ్మ (ఫైల్)

దేవరుప్పుల : ఓ వృద్ధురాలు దైనందిన అలవాటు ప్రకారం చుట్ట తాగి ఆర్పకుండా మంచంలో పెట్టి నిద్రించింది. తెల్లారే సరికి సజీవ దహనమైంది. ఈ విషాదకర ఘటన బుధవారం మండల కేంద్రంలో జరిగింది. మండల కేంద్రం కొత్తవాడలోని ఎస్సీ కాలనీకి చెందిన మాచర్ల ముత్తమ్మ (90)కు నలుగురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. భర్త 25 ఏళ్ల క్రితమే మృతి చెందగా, కొడుకు వెంకన్న బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలోనే వృద్ధాప్యానికి తోడు కొన్నేళ్లుగా పక్షవాత రావడంతో మంచానికే పరిమితమైంది. పెద్ద కూతురు ఎల్లమ్మ ఇదే కాలనీలో స్థిరపడడంతో ఆమె పర్యవేక్షణలో పక్క గదిలోనే ఉంచి సపర్యలు చేస్తున్నారు. రోజువారీగా మంగళవారం రాత్రి ఆమెకు భోజనం పెట్టి వెళ్లింది. భోజనం చేసిన అనంతరం అలవాటు ప్రకారం ముత్తమ్మ చుట్ట తాగి పూర్తిగా ఆర్పకుండా మంచంపైనే పెట్టింది. సరిగా నిప్పు ఆరని చుట్ట.. అంటుకోవడంతో పడకబట్టలతోపాటు వృద్ధురాలు సజీవ దహనమైంది. రాత్రి వర్షం పడడంతో పరిసరాలకు పొగ, మంటలు వ్యాప్తి చెందలేదు. బుధవారం ఉదయం రోజువారీగా తల్లికి సపర్యలు చేసేందుకు కూతురు ఎల్లమ్మ వెళ్లి చూసి సరికి కాలిపోయి విగత జీవిగా కనిపించింది. ఈ ఘటనపై మృతురాలి కూతురు ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

స్వరాష్ట్రంలో బ్రాహ్మణులకు ప్రత్యేక స్థానం

- రూ.232 కోట్ల నిధులతో సంక్షేమం
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి దయాకర్‌రావు

జనగామ: తెలంగాణ రాష్ట్రంలో బ్రాహ్మణ పరిషత్ స్థాపనతో బ్రాహ్మణ కులస్తులకు సముచిత స్థానం లభించిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సూర్యాపేట రోడ్డు ఎస్ఎస్ఎన్ గార్డెన్‌లో బుధవారం జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా ధూప దీప నైవేద్య సంఘం అర్చకుల ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డితో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు బ్రాహ్మణ సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఏటా బడ్జెట్‌లో బ్రాహ్మణ సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటి వివిధ పథకాల అమలుకు రూ.232 కోట్లు కేటాయించిందన్నారు. నాడు 18 వందల ఆలయాల్లో పని చేస్తున్న అర్చకులకు కేవలం రూ.2 వేల 500 వేతనం ఇవ్వగా.. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత 6 వేల 541 ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు రూ.10వేల వేతనం ఇస్తున్నారన్నారు. తెలంగాణలో బ్రాహ్మణ కులస్తుల జనాభా 3 నుంచి 4 శాతం ఉన్నప్పటికీ 10 శాతం రిజర్వేషన్ వర్తింపజేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేనివిధంగా హైదరాబాద్‌లో 10 ఎకరాల స్థలంలో బ్రాహ్మణ సదనం నిర్మించినట్లు తెలిపారు. దేవుడి భూములు కూడా కబ్జాలకు గురి కాకుండా కాపాడుతున్నామన్నారు. దేవాలయాల నిర్వహణకు ఏడాదికి రూ.10 లక్షలు అందజేస్తున్నామన్నారు. స్పెషల్ డెవలప్ ఫండ్ ద్వారా రాష్ట్రంలోని 14 దేవాలయాల్లో వివిధ పనులు చేపట్టేందుకు రూ.107 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. బ్రాహ్మణ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న కేసీఆర్‌ను మూడోసారి భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమం సంఘం జిల్లా అధ్యక్షుడు త్రిపురారి మనోహర్ శర్మ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పిండిపోలు నాగ దక్షిణామూర్తి, ప్రధాన కార్యదర్శి అన్నావఝల ప్రసాద్ శర్మ, కోశాధికారి నందనం హరికిషన్, కన్వీనర్ గోపి కృష్ణమాచార్యులు, కృష్ణమాచార్య సిద్ధాంతి, పాగాల మఠం సాయి శివప్రసాద్, చండీశ్వర్, ఎల్లంబట్ల కరుణాకర్, త్రిపురారి ప్రభుదత్తు, పరమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

జనశక్తి మాజీ నేత మృతి


శ్యాం(ఫైల్)

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేటహవేలిలో జనశక్తి మాజీ నేత పంజాల శ్యాం (58) అలియాస్ కిరణ్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. అతని భార్య శారద ఉద్యమ సహచరిగా ఉంటూ కిడ్నీలు ఫెయిల్ అయ్యి గతంలోనే చనిపోయింది. శ్యామ్‌కు పక్షవాతం రాగా ఇంటివద్దే ఉంటున్నాడు. ఆరోగ్యం క్షీణించడంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గతంలో ఆయన జనశక్తి పాలకుర్తి ఏరియా దళ డిప్యూటీ కమాండర్‌గా పని చేశారని గ్రామస్తులు తెలిపారు. ఆయనకు కూతురు ఉంది. 1991 నవంబర్ 26న శాయంపేటహవేలి సర్పంచ్, సీపీఐ(ఎంఎల్) జనశక్తి (అప్పట్లో చంద్రపుల్లారెడ్డి వర్గం) పార్టీ అనుబంధ రైతు కూలీ సంఘం నాయకుడు దాడి వెంకటయ్యను ప్రత్యర్థులు వరంగల్ బస్టాండ్‌లో బస్సులో ఉండగా రివాల్వర్‌తో కాల్చి చంపారు. దీనికి ప్రతీకార చర్యగా గ్రామంలో టీడీపీ సానుభూతిపరుడు ఇట్టబోయిన ఇద్దయ్య అనే వ్యక్తిని పీడీఎస్‌యూ (అప్పటి చంద్రపుల్లారెడ్డి వర్గం) కార్యకర్తలు హత్య చేశారు. ఈ కేసులో శ్యాం ప్రధాన నిందితుడు. ఈ రెండు హత్యలు అప్పట్లో జిల్లాలో సంచలనం రేపాయి. కాగా శ్యాం మృతి చెందడంతో అప్పటి ఆయన సహచర మిత్రులు, గ్రామస్తులు సంతాపం తెలిపి నివాళులు అర్పించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


బొండయ్య (ఫైల్)

వెంకటాపురం(కె): మండలంలోని సీతారాంపురం పెద్దవాగులో గల్లంతైన బొండయ్య (61) మృతదేహం లభ్యమైంది. మంగళవారం చేపల వేటకు వెళ్లి గల్లంతైన బొండయ్య ఆచూకీ కోసం గ్రామస్తులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం కనిపించలేదు. ఈ నేపథ్యంలో భారీ వర్షాల కారణంగా వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మృతదేహం బుధవారం వాగు ఒడ్డుకు చేరుకుంది. దీంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, గ్రామస్తులు మృతదేహన్ని వాగు నుంచి బయటకు తీశారు. కాగా, ఘటనా స్థలికి వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతి రావు, రెవెన్యూ అధికారులు చేరుకుని పరిస్థితి సమీక్షించారు.

రూ.10లక్షల గంజాయి పట్టివేత

- ఇద్దరి అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కాజీపేట: కాజీపేట పట్టణంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి వద్ద నుంచి రూ. 10లక్షల విలువైన 43 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ చంద్రమోహన్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన లకం అర్జున్, షేక్ సోహెల్.. ఆంధ్రప్రదేశ్‌లో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి కాజీపేటకు చేరుకున్నారు. ఫాతిమానగర్ టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్నారు. దీంతో ఎక్సైజ్ పోలీసులు వారిని ఆపి బ్యాగులు తనిఖీ చేయగా 43 కిలోల గంజాయి లభ్యమైంది. దీంతో వారిని అరెస్ట్ చేసినట్లు సీఐ చంద్రమోహన్ తెలిపారు. కాగా, గంజాయి రవాణా చేస్తున్న నిందితులను పట్టుకున్న సీఐ చంద్రమోహన్, ఎస్సైలు సౌమ్య, తిరుపతి, సిబ్బంది ఖలీల్, కోటి, వీరమల్లు, రషీద్, రవీందర్, వెంకటరమణ, ఆయూబ్, లాలయ్యను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ అభినందించారు.

కాజీపేట జంక్షన్‌లో భారీగా గంజాయి పట్టివేత

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో బుధవారం రైల్వే పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. రైలులో గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి సుమారు 68 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు గురువారం వెల్లడించనున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.